

పిచ్చుకా.. ఎక్కడికెళ్లావ్?

నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

- అంతరించిపోతున్న జాతుల్లో పిచ్చుక
- ఒకప్పుడు ఎక్కడ చూసినా ఇవే..
- ప్రస్తుతం అక్కడక్కడా కనిపిస్తున్న వైనం

ఒకప్పుడు సూర్యోదయ సమయాన ఇంటి గుమ్మాల ముందు కిచకిచమంటూ వాటి కిలకిలారావాలు. సాయం సంధ్య వేళను గుర్తు చేస్తూ గుంపులుగా ఆకాశంలో వాటి విహారం. ఇంటికి వచ్చే అతిథిని గౌరవించినట్టు ఇళ్ల ముందర.. తోటలు.. పొలాల్లో వాటి కోసం వేలాడే వరి కంకులు...ఇదీ పిచ్చుకలతో మనిషి అనుబంధం. కాలంతో పాటు మన జీవనశైలిలో చోటుచేసుకున్న మార్పులు... పెరిగిన సాంకేతికత వాటి మనుగడకు ముప్పు కలిగిస్తోంది. దీంతో ఇవి ఎక్కడ కనిపిస్తాయా అని వెతుక్కోవడం మనవంతవుతోంది. ఈ నేపథ్యంలో పర్యావరణానికి.. రైతులకు ఎంతో మేలు చేసే పిచ్చుకలను కాపాడుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

శృంగవరపుకోట/ గుమ్మలక్ష్మీపురం/సీతంపేట రూరల్/ రాజాం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి)

పల్లెలు పట్టణాలుగా మారుతున్నాయి. పచ్చని చెట్ల స్థానాన్ని కాంక్రీట్ వనాలు ఆక్రమిస్తున్నాయి. ఇవి పక్షుల మనుగడను ప్రమాదంలో పడేస్తున్నాయి. ఆహారంతో పాటు ఆవాసాలు కరువై ఇప్పటికే ఎన్నో పక్షి జాతులు అంతరించిపోయాయి. ఇంటి పక్షిగా పేరొందిన పిచ్చుకలదీ ప్రస్తుతం అదే పరిస్థితి. మన సాంకేతిక పరిజ్ఞానం నుంచి వస్తున్న రేడియేషన్.. మనం సృష్టిస్తున్న కాలుష్యంతో పోరాడే శక్తి లేని ఈ చిట్టి పక్షులు చల్లని ప్రదేశాలకు వలస వెళ్లడమే కాకుండా... ప్రాణాలూ పోగొట్టుకుంటున్నాయి. ఉండేందుకు కాస్త చోటు, తినేందుకు ఆహారం.,.. తాగేందుకు నీరు అందుబాటులో ఉంచితే ఈ జాతిని కొన్నాళ్లయినా కాపాడుకోవచ్చు. గురువారం 'ప్రపంచ పిచ్చుకల దినోత్సవం' సందర్భంగా.. వీటి పరిస్థితిని తెలుసుకుందాం.

పంటలను కాపాడడంలో..

పిచ్చుకలు మానవాళికి చేసే మేలు అంతా ఇంతా కాదు. చిన్నచిన్న క్రిమి కీటకాలను ఆహారంగా తీసుకొని పంటలను చీడపీడల నుంచి కాపాడే శక్తి వీటికి ఉంది. ఇవి చేసే మేలును గ్రహించే రైతులు తమ పంట చేతికి వచ్చినప్పుడు వరి కంకులను చుట్టగా చుట్టి ఇంటి చూరులకు వేలాడదీసేవారు. ఇళ్లలోకి కూడా ఇవి వచ్చేవి. తమకు అవసరమైనప్పుడల్లా వీటిని తింటూ పిచ్చుకలు మనుగడ సాగించేవి. పర్యావరణానికి, రైతులకు ఎంతో మేలు చేసే పిచ్చుకల సందడి ఇప్పుడు ఎక్కడో గానీ కనిపించడం లేదు. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ ప్రభావం వల్ల చాలా వరకు అంతరించిపోతున్నాయి. చెట్లు నరికేయడం, పూరిళ్లు, పెంకుటిళ్ల స్థానాలను డాబా ఇళ్లు ఆక్రమించడం వీటి ఆవాసాలకు పెనుముప్పుగా మారింది. పిచ్చుకలు ఎక్కువగా తినే రాగులు, సజ్జలు, గంటెల పంటలు కూడా తగ్గుముఖం పట్టాయి. దీంతో ఇవి అనువైన ప్రదేశాలను వెతుక్కొని అక్కడికి వెళ్లిపోతున్నాయి. మరోవైపు సెల్ టవర్ల రేడియేషన్ వీటి ప్రాణాలకు ముప్పు తెస్తోంది.

కారణమేంటంటే..

పిచ్చుకజాతి అంతరించిపోయేందుకు ముఖ్యంగా మూడు కారణాలు ఉన్నాయని ప్రకృతి ప్రేమికులు చెబుతున్నారు. సెల్ టవర్ రేడియేషన్, అవాసాలు **(మిగతా 8వ పేజీలో..)**

పిచ్చుకల కోసం వరి కంకులు..

వీరఘట్టం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నడిమికెల్ల గ్రామంలో అల్లు దాలినాయుడు ఇంటి ముందు పిచ్చుకల కోసం వరి కంకులను ఇలా ఏర్పాటు చేశారు. ఏటా వరి కోతల సమయంలో మొదటి వారం ధాన్యపు మోపును తెచ్చి.. ఇలా ఇంటి ముందు కడుతుంటామని చెప్పారు.



నడిమికెల్లలో ఏర్పాటు చేసిన వరి కంకులు

పిచ్చుకల కోసం నీరు..

బొబ్బిలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో కొంత మంది పిచ్చుకల మనుగడను కాపాడేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. పూల్‌బాగ్‌లోని విద్యావేత్తలు ఎంకేనాయుడు (నాని), డాక్టర్ చింతా శారద దంపతులు తమ ఇంటివద్ద 365 రోజులూ పిచ్చుకలకు అవసరమయ్యే వరికంకులను ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన తమ మిత్రులు వరి కంకులను ప్రత్యేకంగా తయారు చేయించి పంపిస్తారని, వాటిని ఇంటి ముందు ఏర్పాటు చేయడం అలవాటుగా మారిపోయిందని ఆ దంపతులు చెబుతున్నారు. ఇదే రకంగా తన కుమార్తె ఉదయచంద్రిక హైదరాబాద్‌లోని తన ఇంట్లో వరి కంకులను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.



బొబ్బిలిలో పిచ్చుకల కోసం వరికంకులను ఇంటిపై ఏర్పాటు చేసిన డాక్టర్ చింతా శారద

పక్షుల కోసం చలివేంద్రం..

బొబ్బిలి పట్టణంలోని తారకరామా కాలనీకి చెందిన కె.కృష్ణదాసు అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త తన ఇంటిపైనపిచ్చుకల కోసం ఆహారం, నీటిని సమకూర్చి పెడుతున్నారు. ప్రత్యేకించి పక్షుల చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వాడేసిన ఆయిల్ డబ్బాలను ప్రత్యే కంగా తయారు.. చేసి తమ స్నేహితు లందరికీ పంపిణీ చేశారు. ఈ డబ్బా లలో పక్షుల కోసం నీరు, తిండిగింజ లను పెట్టుకునే ఏర్పాటు చేశారు. మూగజీవాలన్నిటికీ ఆహారం సమకూ ర్చడం ఆయన అలవాటుగా పెట్టుకు న్నారు. సెల్ టవర్లు పెరిగిపోవడంతో వాటి రేడియేషన్ ప్రభావంతో పిచ్చుకల మనుగడ కష్టమవుతోందని.. వాటిని పూర్తిగా అంతరించిపోకుండా కాపాడుకోవాలని కృష్ణదాసు పిలుపునిచ్చారు.



బొబ్బిలి తారకరామకాలనీలో పక్షుల చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన కృష్ణదాసు

- అభిమాని ఫౌండేషన్ చైర్మన్ రెడ్డి రాజగోపాలనాయుడు, గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తిలు ఊరపిచ్చుకల కోసం తిండి గింజలను సమకూర్చారు. జీవవైవిధ్యం, వాతావరణ సమతుల్యం వంటి వాటి కోసం మూగజీవాల పట్ల దయ, జాలి, కరుణ చూపాలన్నారు.



మోదుగులపేటలోని ఫ్లోరైడ్ బాధితులు

ఆ రెండు గ్రామాలపై ఫ్లోరైడ్

- సంవత్సరాలుగా ప్రజలు విలవిల
- వ్యాధులతో వందలాది మంది సతమతం
- చేతిపంపు నీటిలో అధికంగా ఫ్లోరిన్
- విషయం గుర్తించినా చర్యలు శూన్యం
- మోదుగులపేట, చినముకుందపురం ప్రజల పరిస్థితి దయనీయం

అందరికీ ఆరోగ్యాన్ని ఇచ్చే నీళ్లు ఆ రెండు గ్రామాల ప్రజలకు అనారోగ్యాన్ని తెస్తున్నాయి. దాహం తీర్చే జలం వారికి గరళం అవుతోంది. సాధారణంగా నీరు బాగా తాగకుంటే సమస్యలు వస్తాయి. వారికి మాత్రం నీరు తాగినా సమస్యలొస్తున్నాయి. దాహం వేసినా.. గొంతు పొడిగా మారినా తనివి తీరా నీరు తాగలేని దుస్థితిలో ఉన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఫ్లోరైడ్ సమస్యను ఎదుర్కొంటున్న మోదుగులపేట, చినముకుందపురం ప్రజల దుస్థితిదీ. వారు పడుతున్న అవస్థలు.. ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలను అధికారులు గుర్తించినా పరిష్కారం చూపడం లేదు. ఈ రెండు గ్రామాల్లో వందలాది మంది దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్నారు.



అధికంగా ఫ్లోరిన్ ఉన్న నీటిని ఇస్తున్న బోరు

రాజాం/ సంతకవిటి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను కలుషితం చేసి మనిషి గొంతుకలో గరళంగా మారుతోంది అక్కడి నీరు. కొంతకాలంగా ఫ్లోరైడ్ నీటితో ఆ రెండు గ్రామాల ప్రజలు సతసతమవుతున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు.. వందలమంది వివిధ రోగాలతో బాధ పడుతున్నారు. సంతకవిటి మండలం మోదుగులపేట పంచాయతీ, చినముకుందపురం గ్రామాల్లో సుమారు 300 గృహాలు ఉంటాయి. చాలా కాలంగా అక్కడి చేతిపంపుల నుంచి వచ్చే నీటిలో ఫ్లోరిన్ శాతం ఎక్కువగా ఉంటోంది. సాధారణంగా నీటిలో ఫ్లోరిన్ 0.5 పీపీఎం (పార్ట్స్ పెర్ మిలియన్) ఉండాలి. కానీ 2 నుంచి 4 శాతం ఉన్నట్టు అధికారులు ఇది వరకూ ప్రాథమికంగా గుర్తించారు. దీనికి పరిష్కారంగా శుద్ధ జలాల ప్లాంట్ ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదన వచ్చింది. కానీ ఆచరణలో పెట్టలేదు. స్థానికులు ఎన్నో విన్నపాలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోవడంలేదు.

- ఈ గ్రామాల్లో చిన్న వయసు నుంచే రుగ్మతల బారినపడుతున్నారు. ముఖ్యంగా **(మిగతా 8వ పేజీలో..)**

నిత్యం భయమే..

మా గ్రామంలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఎవరు ఏ రోగం బారిన పడతారో తెలియదు. ముఖ్యంగా దంతాల రంగు మారుతోంది. కాళ్లు వంకర్లు తిరుగుతున్నాయి. అలాగే విపరీతంగా పీకుతుంటాయి. దీంతో ప్రైవేటు ఆస్పత్రులను ఎక్కువగా ఆశ్రయిస్తుంటాం. నేను సుమారు 12 ఏళ్ల నుంచి కాళ్ల వంకర్లతో బాధ పడుతున్నాను. ప్రభుత్వ వైద్యులు ఒక్కరోజు కూడా మా గ్రామాన్ని సందర్శించడం చూడలేదు. ఫ్లోరైడ్ సమస్యపై పలుమార్లు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు వివరించాం. అయినా చర్యలు తీసుకోలేదు.

- మజ్జి రాములు, గ్రామస్థుడు, మోదుగులపేట

అంతలోనే అమ్మకు దూరంగా..

- తల్లితో మాట్లాడుతుండగానే విద్యార్థినిని కాటేసిన పాము
- ఆస్పత్రికి తరలించినా దక్కని ప్రాణం
- బూర్లెపేటలో విషాదం

అంతవరకూ అమ్మతోనే మాట్లాడింది. జోకులు వేస్తూ నవ్వించింది. తన స్నేహితుల యోగక్షేమాలు.. కబుర్లు చెప్పింది. ఇంటర్ పరీక్షలు బాగా రాసినట్లు తెలిపింది. తల్లీకూతుళ్ల ఆత్మీయానురాగాలు చూసిన విధికే కన్ను కుట్టిందేమో ఉన్నఫలంగా పాముకాటు రూపంలో వారిని విడదీసింది. వరండా అరుగుపై అమ్మ చెంతనే కూర్చొన్న కుమార్తెను పాము కాటేసింది. బూర్లెపేటలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. నిమిషాల్లో ఆస్పత్రికి తరలించినా ఆమె ప్రాణం దక్కలేదు. అంతవరకు ఎన్నో మాటలాడిన కుమార్తె మౌనిక(16) అంతలోనే అచేతనంగా మారడాన్ని పాపం ఆ తల్లి తట్టుకోలేకపోయింది. గుండెలు పగిలేలా విలపించింది.



మౌనిక(ఫైల్)

గుర్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బూర్లెపేట గ్రామానికి చెందిన ద్వారపూడి మౌనిక (16) ఇటీవలే ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు రాసింది. మొన్నటివరకూ పుస్తకమే లోకంగా ఉన్న ఆమె పరీక్షలు పూర్తికావడంతో వివిధ పనుల్లో అమ్మకు సహకారం అందిస్తోంది. రోజులాగే మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటి పనులన్నీ పూర్తిచేసుకుని తల్లి లక్ష్మీ పక్కనే ఇంటి వరండా అరుగుపై కూర్చొంది. చాలాసేపు వారిద్దరు మాట్లాడుకున్నారు. వీధిలో అటుగా వచ్చేవారిని పలకరించారు. ఇంట్లోకి వెళ్లిపోదామని అనుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా కాళ్ల వద్దే మాటు వేసిన పాము మౌనికను కాటేసింది. వెంటనే ఆమె గమనించి తల్లికి చెప్పింది. ఇద్దరూ కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వారంతా వచ్చి సమీపంలో ఉన్న తెట్టంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగానే ఆమె తుదిశ్వాస విడిచింది. ఈ దుర్ఘటనను తల్లి జీర్ణించుకోలేకపోయింది. కుమార్తె **(మిగతా 8వ పేజీలో..)**



మౌనిక మృతదేహం వద్ద విలపిస్తున్న స్నేహితులు

మృత శిశువుతో నిరసన

7

- వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందన్న తండ్రి
- ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గిరిజన కుటుంబం ఆందోళన



విచారంలో ఉన్న మృత శిశువు తల్లిదండ్రులు,

మృత్యువుతో పోరాడి.. తనువు చాలించి..

- జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు తనయుడు ప్రణీత్‌బాబు మృతి
- శోకసంద్రంలో కుటుంబం
- మాజీ సీఎం జగన్ ఫోన్‌లో పరామర్శ

7



నైపుణ్యాలను మెరుగుపరుచుకోండి

7

- కానిస్టేబుళ్లతో ఎస్పీ వకుల్‌జిందాల్

అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

- పోక్సో చట్టం గురించి తెలుసుకోవాలి
- జిల్లా న్యాయాధికారి సాయికల్యాణ చక్రవర్తి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి సాయికల్యాణ చక్రవర్తి

విజయనగరం క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా, అనుచితంగా ప్రవర్తిస్తే, వెంటనే తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేయాలని... అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా న్యాయాధికారి బి.సాయికల్యాణ చక్రవర్తి అన్నారు. విజయనగరంలోని ఏపీ మోడల్ స్కూల్ (ఫూల్‌బాగ్)లో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన న్యాయ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2012లో వచ్చిన పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ చట్టంపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఈ చట్టం కింద కేసు నమోదైతే తీర్పులు కూడా వెనువెంటనే వస్తాయని, సంబంధిత వ్యక్తులకు శిక్షలు పడుతున్నాయని చెప్పారు. బాలబాలికలకు న్యాయ వ్యవస్థ ఎప్పుడు అండగా ఉంటుందని, ఏ సమయంలోనైనా ఫిర్యాదు చేయవచ్చునని బాలల హక్కులు కాపాడటానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ముందుంటుందన్నారు. 18 ఏళ్ల లోపు బాలబాలికలు చదువుపైనే దృష్టి పెట్టాలని, బాల్య దశ నుంచే రాజ్యాంగం, చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవంతో మెలగాలని... నైతిక విలువలు నేర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి అప్పలస్వామి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్, ఎంఈఓ సత్యవతి, ప్రిన్సిపాల్ డాక్టరు పర్వీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెల్లిలో గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం

- నేడు ప్రజాభిప్రాయ సేకరణ

కొత్తవలస, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం రెల్లి గ్రామంలో ఏర్పాటు చేయదలచిన గ్రేహౌండ్స్ శిక్షణా కేంద్రానికి స్థల సేకరణపై గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ బి.నీలకంఠారావు తెలిపారు. సమావేశానికి ఆర్డీవో కీర్తి హాజరవుతున్నారు. గ్రేహౌండ్స్ శిక్షణా కేంద్రం రెల్లిలో ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉంది.

గిరిజన యూనివర్సిటీని మండలంలోని రెల్లి రెవెన్యూలో ఏర్పాటుకు 2015లో 529 ఎకరాలను నాటి టీడీపీ ప్రభుత్వం సేకరించింది. కేంద్ర బృందం పరిశీలించి యూనివర్సిటీ స్థాపనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రహరీ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేసింది. ప్రహరీ నిర్మాణం కూడా పూర్తయింది. కాగా 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ స్థలాన్ని మార్చేసింది. మెంటాడ మండలంలో ఏర్పాటు చేయడానికి స్థల సేకరణ చేసింది. భవనాల నిర్మాణం కూడా ప్రారంభం కావడంతో రెల్లి రెవెన్యూలో సేకరించిన 529 ఎకరాల్లో గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. శిక్షణ కేంద్రం ఏర్పాటుకు అనువుగా ఉందా? లేదా? అనే విషయమై ఉన్నతాధికారులు నెల రోజులు కిందట రహస్యంగా పరిశీలించారు. అనువుకుగా ఉన్నట్టు భావించడంతో రెల్లి రెవెన్యూ గ్రామంలోని అప్పన్నదొరపాలెం, జోడుమెరక, తమ్మన్న మెరక గ్రామాల ప్రజల అభిప్రాయాల సేకరణ కోసం గురువారం సదస్సు నిర్వహిస్తోంది. సమావేశానికి ఆర్డీవో దాట్ల కీర్తి హాజరవుతారని తహసీల్దార్ తెలిపారు.

సంగీత కళాశాలకు బడ్జెట్ కేటాయించండి



విజయనగరం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎంతో పురాతనమైన మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు బుధవారం అసెంబ్లీలో కోరారు. ఎంతో పేరు ప్రఖ్యాతలు కలిగిన కళాశాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. అలాగే మంగళగిరిలోని చేనేత కార్మికులు చేస్తున్న చీరలకు మార్కెట్ కల్పించిన మాదిరిగా బొబ్బిలి ప్రాంతంలో తయారు అవుతున్న చీరలకు కూడా మార్కెట్ కల్పించాలని కోరారు. దానివల్ల బొబ్బిలిలో కూడా చేనేత కార్మికులను ప్రోత్సాహించినట్టు అవుతుందన్నారు.

అసెంబ్లీలో మన వాణి

బొబ్బిలి వీణపై చర్చ



బొబ్బిలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలికి వన్నె తెచ్చిన వీణ చరిత్ర, దాని పూర్వాపరాలను, కళాకారుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు (బేబీనాయన) బుధవారం అసెంబ్లీలో ప్రత్యేకంగా చర్చించారు. పనస కలప కొరత కారణంగా వీణల తయారీని పూర్తి స్థాయిలో చేపట్టలేకపోతున్నారని తెలిపారు. పదేళ్ల క్రితం ఇచ్చిన యంత్రాలు, పనిముట్లు కాలం చెల్లడంతో మూలకు చేరాయన్నారు. వీణల తయారీదారులకు కలప అందుబాటులో ఉండే విధంగా అటవీ ప్రాంతంలో పనస చెట్లను విరివిగా పెంచేలా చూడాలని కోరారు. ఇక్కడ కలప అందుబాటులోకి వచ్చే వరకు తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో అందుబాటులో ఉన్న పనస కలపను వీణల తయారీ కళాకారులకు సరఫరా చేయాలని కోరారు. దీంతో సంబంధిత మంత్రి ఎస్.సవిత ప్రకటన చేశారు. వీణల తయారీ కళాకారులకు ఉపాధి కల్పించేందుకు, ఆధునిక పనిముట్లు అందజేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీనిపై వీణల తయారీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఉత్సాహంగా వాలీబాల్ ఆడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గం లోను క్రీడలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజాసేవలో తలమునకలయ్యే ప్రజాప్రతినిధులకు ఉపశమనం కలిగించే దిశగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మూడు రోజుల పాటు క్రీడలను నిర్వహిస్తోందన్నారు.



వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే కోండ్రు



సీఎంతో మాట్లాడుతున్న బంగార్రాజు

సీఎంని కలసిన బంగార్రాజు

భోగాపురం, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు ఢిల్లీ ఎయిర్ పోర్టులో మంగళవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లిమర్ల నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

భోగాపురం, మార్చి19 (ఆంధ్రజ్యోతి): మండలం జగ్గయ్యపేట గ్రామానికి చెందిన బమ్మిడి ఆనంద్ తన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన బైక్‌ను ఎప్పటిలాగే రాత్రి ఇంటి ముందు నిలిపానని, ఉదయం లేచి చూసేసరికి అక్కడ లేదన్నారు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూర్యకుమారి కేసు నమోదు చేశారు.

సీతమ్మవారి శతమానానికి బంగారం విరాళం

లక్కవరపుకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగారాయపురంలోని రామాలయంలోని సీతమ్మవారి శతమానాల కోసం అరతులం బంగారాన్ని గ్రామానికి చెందిన గేదెల సీతారాం కుటుంబ సభ్యులు విరాళంగా ఇచ్చారు. బుధవారం గ్రామ పెద్దలు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావుకు పెద్దల సమక్షంలో అందజేశారు. బంగారాన్ని విరాళంగా ఇచ్చిన కుటుంబానికి కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధితులకు వంట సామగ్రి

జామి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జామిలో కొద్దిరోజుల కిందట జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడిన కుటుంబాలకు రెడ్‌క్రాస్ అండగా నిలిచింది. బుధవారం రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కంది వెంకటరమణ ఆధ్వర్యంలో బాధితులకు వంట సామగ్రి, దుప్పట్లు, టార్పాలిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాము, మన్మథరావు తదితరులున్నారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

శృంగవరపుకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆన్‌కాల్ డ్రైవర్ కుటుంబానికి బుధవారం శృంగవరపుకోట డిపో సిబ్బంది ఆర్థిక సాయం చేశారు. బొడ్డవర గ్రామానికి చెందిన బి.పోలీరావు ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్‌గా పనిచేసేవారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, చిన్నపిల్లలు ఉండటంతో ఆర్టీసీ సిబ్బందితో పాటు బుక్కు నాయుడుపేట మోడల్ స్కూల్ విద్యార్థులు రూ.60 వేలు సేకరించారు. ఆ మొత్తాన్ని డిపో మేనేజర్ రమేష్ చేతుల మీదుగా డ్రైవర్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఎన్‌ఎంయూ గేట్ ధర్నా

శృంగవరపుకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ఆర్టీసీ డిపో గేట్ ఎదుట బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ధర్నా చేసింది. జోన్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిపో సెక్రటరీ ఎ.రాజయ్య తదితరులున్నారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు

శృంగవరపుకోట రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టాంలో కోటమ్మ తల్లి ఘటాలను బుధవారం రాత్రి ఘనంగా ఊరేగించారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అమ్మవారి ఘటాల ఊరేగింపుతో కొట్టాంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.

23న వయోజనులకు పరీక్ష

నెల్లిమర్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వయోజనులకు అక్షరాస్యత పరీక్షను ఈనెల 23న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.రామకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరీక్షపై ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్యక్రమంలో ఏపీఎం సురేష్, ఈవోపీఆర్డీ శంకర జగన్నాథం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.శారద త్రినాథమ్మ, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల తనిఖీ

రాజాం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజాం-డోలపేట మధ్య జరుగుతున్న రహదారి విస్తరణ పనులను ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ బి.వెంకటేశ్వరావు బుధవారం తనిఖీ చేశారు. కిలోమీటర్ పరిధిలో పలుచోట్ల రహదారిపై గుంతలు తవ్వి శాంపిళ్లను సేకరించారు. ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలు, బాల కార్మికులు తగ్గాలి

విజయనగరం కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, బాల కార్మికులు తగ్గాలని జేసీ సేతు మాధవన్ అన్నారు. బుధవారం జిల్లా స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద బాలల సంక్షేమం పరిరక్షణ కోసం గ్రామస్థాయిలో సర్పంచ్ ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయి కమిటీలో మహిళా పోలీస్ కన్వీనర్‌గా ఉంటారని, పంచాయతీ సభ్యులు, ఉపాధ్యాయులు, ఎన్‌జీవో, ఆరోగ్య వర్కర్స్ తదితరులు సభ్యులుగా ఉంటారని వివరించారు. గ్రామ స్థాయి సమావేశాల్లో అనాథ పిల్లలు, స్కూల్ డ్రాపౌట్స్‌ను గుర్తించాలన్నారు. బాల్య వివాహాలు, ట్రాఫికింగ్, డ్రగ్స్ తదితర అంశాలపై చర్చించాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంలో చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ప్రసన్న, డీఎంహెచ్‌వో జీవనరాణి , మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, జడ్పీ సీఈవో సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

గిరిజన వర్సిటీలో వర్క్‌షాప్

విజయనగరం కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన విశ్వ విద్యాలయంలో జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో మాలిక్యూల్స్ టు మెటీరియల్స్ అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ మాట్లాడతూ విద్యా నైపుణాన్ని పెంపొందించడంలో విశ్వ విద్యాలయం ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. ప్రసుత్తం మెటీరియల్ సైన్స్‌పై ప్రపంచం ఆధారపడి ఉంటుందని, రానున్న రోజుల్లో ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, నానో టెక్నాలజీలతో కలిసి ప్రపంచాన్ని శాసిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నటరాజన్, బాలాజీ, ప్రసాద్‌రెడ్డి, శరత్ చంద్రబాబు, సురేష్‌బాబు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీనివాస్

నైపుణ్యాలను మెరుగుపరుచుకోండి: ఎస్పీ

విజయనగరం క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో సైబర్ నేరాలు, మోసాలు మరింత పెరిగే అవకాశం ఉందని, వాటిని ఛేదించేందుకు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ పోలీసు స్టేషన్‌లలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న కానిస్టేబుల్స్‌కు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను నియంత్రించేందుకు నమోదైన కేసుల్లో దర్యాప్తు చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి పోలీసు అధికారి మెరుగుపరుచుకోవాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలు ఛేధించడంలో సమర్థంగా విధులు నిర్వహిస్తారో? అటువంటి వారికి పోలీసు శాఖలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందన్నారు. నేరాలను ఛేదించేందుకు అవసరమైన పరిజ్ఞానం, సాంకేతికత, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో సైబర్, సోషల్ మీడియా సెల్ సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ లీలారావు, కంప్యూటర్ నిపుణులు రామరాజు, కె.ప్రసాద్, జగదీశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

అప్రోచ్ రోడ్లను ఏర్పాటు చేయండి

భోగాపురం, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి ఆయా గ్రామాల పరిధిలో అప్రోచ్ రోడ్లను ఏర్పాటు చేయాలని ఎ.రాయవలస, భైరెడ్డిపాలెం, కంచేరు, గూడెపువలస తదితర గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలు ఆర్డీవో డి.కీర్తి దృష్టికి తీసుకెళ్లారు. మండలం అమటాంరాయవలస నుంచి గూడెపువలస వరకు ఎయిర్‌పోర్టు రహదారిని ఆర్డీవో డి.కీర్తి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎ.రాయవలస, సవరవల్లి, గూడెపువలస సర్పంచ్‌లు శివారెడ్డి, విజయభాస్కర్, అయ్యప్పరెడ్డి తదితరులు అప్రోచ్ రోడ్ల విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులు, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎం.సురేష్, డీటీ గాంధీ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో

ఆరోగ్యశ్రీతో 92 వేల మందికి వైద్యసేవలు

రాజాం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ ద్వారా 91,836 మందికి వైద్యసేవలు అందుతున్నాయని ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా మేనేజర్ దూబ రాంబాబు తెలిపారు. బుధవారం రాజాం సామాజిక ఆసుపత్రిని ఆయన సందర్శించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబును కలిసి ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు అందించే భోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకూ రూ.194 కోట్లు విలువైన వైద్య సేవలు అందాయన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి, విజయనగరం ఘోషా ఆసుపత్రి, 3 ఏరియా ఆసుపత్రులు, 5 కమ్యూనిటీ ఆసుపత్రులు, 8 అర్బన్ హెల్త్ సెంటర్లు, 48 పీహెచ్‌సీలు, 25 ప్రైవేట్ ఆసుపత్రుల ద్వారా ఎన్టీఆర్ వైద్యసేవలు అందుతున్నాయన్నారు. ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్తే అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



రోగులకు ఇచ్చే భోజనం పరిశీలిస్తున్న రాంబాబు

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

విజయనగరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్విని అన్నారు. మంగళవారం బీసీ కార్పోరేషన్ ఆధ్వర్యంలో బీసీ రుణాలపై డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీల్లో పేదలకు ఈ పథకం వరం లాంటిదన్నారు. సుమారు 145 రకాల యూనిట్‌లకు ప్రభుత్వం సబ్సిడీని, బ్యాంకుల నుంచి రుణాలు ఇవ్వనుందన్నారు. యూనిట్‌లను స్థాపించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. బీసీ కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు మాట్లాడుతూ బీసీ రుణాలకు దరఖాస్తు చేసే విధానం అర్హతలు, బీసీ సంక్షేమ శాఖ కార్యకలాపాలు, వసతిగృహాల స్థితిగతులు, బీసీ స్టడీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాలు వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ బీసీ డబ్ల్యూవో యశోదనరావు, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

గజపతినగరం, మార్చి19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజా సమస్యలపై అధికారులు దృష్టిసారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.లక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని మరుపల్లిలో ప్రజా చైతన్యయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, పి.సింహాచలం, చంటి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో పర్యావరణ పరిరక్షణ

నెల్లిమర్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఏపీసీఎన్‌ఎఫ్ ఏడీపీ ప్రకాశరావు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ, వెలుగు ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలతో కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. సమావేశంలో ఏడీపీ ప్రకాశరావు, ఆర్‌టీవో హేమసుందర్, ఏవో ఎం.పూర్ణిమ, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ బంగారమ్మ, ఏపీఎంలు సురేష్, ఎల్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

● గరివిడి: ప్రజల ఆరోగ్యానికి ఎంతో దోహదపడే ప్రకృతి వ్యవసాయం గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని వెలుగు ఏపీఎం నారాయణ రావు కోరారు. గరివిడిలోని వెలుగు కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమాఖ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రకృతిసాగుపై స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు.

అయ్యలును కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

విజయనగరం దాసన్నపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జనసేన సీనియర్ నాయకుడు గురాన అయ్యలును బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్మ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం చర్చించారు.

మార్కెట్ వేలం పాట ఖరారు

కొత్తవలస, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస రోజువారీ మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసుకునేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం వేలం పాట నిర్వహించారు. రూ.9 లక్షలకు బొడ్డు రమణమ్మ పాట దక్కించుకున్నారు. వేలం పాటలో 8 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మచ్చ రామస్వామి, ఈవో శైలజ, ఈవోపీఆర్డీ శ్రీదేవి పాల్గొన్నారు.

పూజా సామగ్రికి వేలం పాట

రాజాం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పాత బస్టాండ్ సమీపంలోని నవదుర్గ అమ్మవారి దేవస్థానంలో రెండేళ్లపాటు పూజా సామగ్రి అమ్మకాలకు సంబంధించి బుధవారం నిర్వహించిన వేలంపాట రూ.4.85 లక్షలకు ఖరారైంది. ఇప్పటికే పూజ సామగ్రి అమ్మకాలు నిర్వహిస్తున్న ఆనందరావు ఈసారి కూడా వేలంలో టెండర్‌ను దక్కించుకున్నారు. దేవస్థానం ఈవో పొన్నాడ శ్యామలరావు, పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఈవో బివి మాధవరావు, గురుభవాని కూరాడ వెంకటరావు తదితరుల సమక్షంలో నిర్వహించిన వేలం పాటలో ఏడుగురు వ్యక్తులు పాల్గొన్నారు.

మృత శిశువుతో నిరసన

● వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందన్న తండ్రి

● ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గిరిజన కుటుంబం ఆందోళన



ఆసుపత్రి ఎదుట మృత శిశువుతో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

శృంగవరపుకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు చనిపోయిందని, మంగళవారం రాత్రంతా వైద్యులు, నర్సులు, సిబ్బంది ఎవరూ గర్భిణిని పట్టించుకోలేదని ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గిరిజన కుటుంబం బుధవారం ఆందోళన చేసింది. బిడ్డ పుట్టిందని చెప్పిన వారే, కాసేపటికి ప్రాణం లేని శిశువు జన్మించిందని చెప్పారని, ప్రసవ సమయంలో వైద్యులు లేకుండా నర్సులు ప్రసవం చేయించడం ఎంతవరకు న్యాయమని మృత శిశువు తండ్రి కృష్ణబాబు వైద్యులను ప్రశ్నించారు. ఆ వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గుమ్మపంచాయతీ శివారు నిమ్మవూట గ్రామానికి చెందిన గర్భిణి పనసల సంతోషికుమారికి మంగళవారం రాత్రి 7గంటల సమయంలో పురిటినొప్పులు వచ్చాయి. దీంతో 108 వాహనంలో రాత్రి 8.30 గంటల సమయంలో శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్చారు. ప్రసవానికి వచ్చిన గర్భిణి రాత్రంతా వాంతులు చేసుకున్నా వైద్యులు, నర్సులు, సిబ్బంది అటు వైపు చూడలేదని ఆమె భర్త ఆరోపిస్తున్నారు. బుధవారం ఉదయం 10గంటల సమయంలో ఆమెకు సాధారణ ప్రసవం చేశారు. మృత శిశువుకు జన్మనించింది. ముందు ఆడబిడ్డ పుట్టిందని చెప్పిన నర్సులు తరువాత బిడ్డ చనిపోయిందని చెప్పడమేంటంటూ కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని ఆసుపత్రి ఎదుట మృతశిశువుతో నిరసనకు దిగారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తన బిడ్డ చనిపోయిందని సూపరింటెండెంట్ డాక్టర్ నీల, ఇతర వైద్య బృందం వద్ద కృష్ణబాబు కంటనీరు పెట్టుకున్నాడు. ఇక్కడైతే మంచి వైద్యం దొరుకుతుందని వచ్చినందుకు మృత శిశువును చేతిలో పెట్టారంటూ వాపోయాడు.



వైద్యులను ప్రశ్నిస్తున్న కృష్ణబాబు

మృత్యువుతో పోరాడి.. తనువు చాలించి..

● జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు తనయుడు ప్రణీత్‌బాబు మృతి

● శోకసంద్రంలో కుటుంబం ● మాజీ సీఎం జగన్ ఫోన్‌లో పరామర్శ

విజయనగరం దాసన్నపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఇంట విషాదం చోటు చేసుకుంది. ఐదేళ్ల కిందట నగరంలోని ప్రదీప్‌నగర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావు తనయుడు ప్రణీత్‌బాబు (19) విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సుదీర్ఘకాలంగా మృత్యువుతో పోరాడుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. శ్రీనివాసరావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సాయిమోహిత్ ప్రస్తుతం పీజీ చదవుతున్నాడు. రెండో కుమారుడు ప్రణీత్‌బాబు పదో తరగతి చదువుతున్నప్పుడు 2020 మే 15న తన స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంపై ప్రదీప్‌నగర్‌లోని తన ఇంటికి వెళ్తూ దారిలో లారీని ఢీ కొన్నాడు. ఆ ఘటనలో ప్రణీత్‌బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాసరావు దంపతులు కుమారుడిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖకు, తర్వాత హైదరాబాద్, చివరకు ముంబైకి తరలించారు. అయినప్పటికీ ప్రణీత్‌బాబు పూర్తిగా కోలుకోలేదు. తుదకు విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేయిస్తున్నారు. మంగళవారం రాత్రి ప్రణీత్ ఆరోగ్యం విషమించడంతో వైద్యులు మరోసారి అత్యవసర విభాగానికి తరలించి వైద్య సేవలు అందించారు. అయినప్పటికీ ప్రణీత్‌బాబు ప్రాణం నిలవలేదు. ప్రణీత్ బాబు మృతదేహాన్ని ధర్మపురి రోడ్డులోని శ్రీనివాసరావు నివాసానికి తరలించి మధ్యాహ్నం తోటపాలెం లోని రోటరీ స్వర్గధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమారుడు ప్రణీత్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి జగన్.. శ్రీనివాసరావును ఫోన్‌లో పరామర్శించారు. ప్రణీత్ మృతిపై ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



అంతిమయాత్రలో మజ్జి శ్రీనివాసరావు

శుభకార్యానికి వెళ్తూ.. అనంత లోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

దత్తిరాజేరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా కొరియర్ వ్యాన్ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ ఘటన మండలంలోని కోరపుకొత్తవలస జంక్షన్ జాతీయ రహదారిపై జరిగింది. స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేశ్ వివరాల ప్రకారం.. మండలంలోని తాడేంద్రవలస గ్రామానికి చెందిన ఆవాల రాము(55), కట్టబోను లక్ష్మణరావు (23) బుధవారం ద్విచక్ర వాహనంపై కె.కృష్ణాపురంలో శుభకార్యానికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కొరియర్ వ్యాను వారిని బలంగా ఢీకొంది. దాంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎస్ఐ రాజేశ్ కేసు నమోదు చేశారు.



ఘటనా స్థలంలో ఎస్ఐ రాజేశ్

క్వారీని పరిశీలించిన రెవెన్యూ అధికారులు



క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

శృంగవరపుకోట రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం రెవెన్యూ పరిధిలో అక్రమ పేలుళ్లపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'వారి గుండెల్లో బ్లాస్టింగ్' కథనంపై కలెక్టర్ అంబేడ్కర్ స్పందించారు. దానిపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి నివేదిక అందించాలని తహసీల్దార్ అరుణకుమారిని బుధవారం ఆదేశించారు. దాంతో బుధవారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్, వీఆర్‌వో సుధీర్ సంబంధిత క్వారీను పరిశీలించారు. ధర్మవరం, చుక్కవానిపాలెం గ్రామాల్లో ప్రజల నుంచి వివరాలు సేకరించారు. పూర్తి రికార్డులతో హాజరు కావాలని క్వారీ యజమానిని ఆర్ఐ మనోజ్ ఆదేశించారు. క్వారీ అనుమతులపై మైనింగ్ అధికారులకు లేఖ రాసి మరిన్ని వివరాలు సేకరిస్తామని తెలిపారు. రెవెన్యూ బృందం పరిశీలనతో ఈ ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఇకనుంచి తమకు పేలుళ్ల బెడద ఉందని అంటున్నారు.

కట్టెల పొయ్యిపై వివరణ కోరిన డీఈవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శృంగవరపుకోట రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 'కట్టెల పొయ్యిపై వంట' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి డీఈవో మాణిక్యం నాయుడు స్పందించారు. దానిపై పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి వివరణను డీఈవో కోరారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దు

రాజాం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వీధి వ్యాపారాలు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వీధి వ్యాపార సంఘం నాయకులు, వారికి చేయుతను అందించే బ్యాంకుల మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని వీధి వ్యాపారాలకు మూడు జోన్లుగా విభజించామన్నారు. అంబేడ్కర్ కూడలి నుంచి శ్రీనివాస థియేటర్- రోడ్డు సారధి కేడలి వరకూ, శ్రీకాకుళం రోడ్డులో పెట్రోల్ బంక్ వరకు, పాలకొండ రోడ్డులో జేజే హోటల్ వరకు, బొబ్బిలి రోడ్డులో ఆర్‌సీఎం స్కూల్ గేట్ వరకూ, బొబ్బిలి కూడలిలో మూడు వైపులా 50 మీటర్లు పొడవునా రెండు కూడళ్లను రెడ్ జోన్‌గా పరిగణిస్తున్నట్టు వెల్లడించారు. పాఠశాలలు, ఆసుపత్రులు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల దగ్గరలో ట్రాఫిక్ లేని సమయంలో వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. మెయిన్ రోడ్డులో వ్యాపారాలు చేయుటకు కొనసాగించవచ్చాన్నారు. సమావేశంలో టీపీవో, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రామప్పలనాయుడు

నిర్వహణ లేక.. నీటికోసం అగచాట్లు

● నిరుపయోగంగా మారిన వైనం ● ఇదీ పాఠశాలల్లో ఆర్వోప్లాంట్ల పరిస్థితి

బొబ్బిలి /రూరల్, మార్చి 19 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్లు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. దీంతో విద్యార్థులు తాగునీటికి అగచాట్లకు గురవుతున్నారు. కొందరు ఇళ్ల నుంచే సీసాలతో నీటిని తీసుకు వస్తున్నారు. మరి కొందరు స్థానికంగా లభ్యమయ్యే బోరుబావుల నుంచి నీటిని తాగా దాహం తీర్చుకుంటున్నారు. కృష్ణాపురం యూపీ పాఠశాలలో ఆర్వో ప్లాంటు పనిచేయక పోవడంతో 38 మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వీరంతా మధ్యాహ్న భోజనం తర్వాత బయట కొళాయి నీటిని తాగుతున్నా రు. ఆర్వోప్లాంట్ పరిస్థితిపై మెకానిక్ దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన రాగానే ప్లాంట్ వినియోగంలోనికి తీసుకువస్తామని హెచ్ఎం శ్రీరామమూర్తి తెలిపారు. రామన్నదొరవలస శ్రీఅరిగంగయ్య పురపాలక ప్రాథమిక పాఠశా లలో ఏర్పాటు చేసిన మినీ ఆర్వో ప్లాంటు పనిచేయక పోవడంతో 22 మంది విద్యార్థులు కొళాయి నీటిపైనే ఆధారపడుతున్నారు. ఇక్కడి ప్లాంట్ వినియోగంలోనికి తీసుకువస్తామని హెచ్ ఎం ఎం.జయరాజు తెలిపారు.



కృష్ణాపురం పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంటు

తాగు నీరు లేదు.. రోడ్లు లేవు

● ఇదీ సీహెచ్ బొడ్డవలస పంచాయతీ పరిధిలో గిరిజన గ్రామాల్లో దుస్థితి



బట్టివలసలో అంతర్గత రోడ్డు లేని దృశ్యం

బొబ్బిలిరూరల్, మార్చి 19 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సీహెచ్‌బొడ్డవలస పంచాయతీ పరిధిలోగల అక్కేనవలస, చిన అక్కేనవలస, మోసాయివలస, చిన మోసారువలస, సియోనువలస, కృపావలస గిరిజన గ్రామాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. ఇక్క డ కనీసం తాగునీరు సైతం లేదు. ఎటువంటి రోడ్ల సదుపాయాలు లేవు. చిన అక్కేనవ లస, బట్టివలసలో 15 చొప్పున, మోసాయి వలసలో 20, సియోనువలస 18, కృపావలస 25, చిన మోసారు వలస 14 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా ప్రతిచిన్న సమస్యకు బొడ్డవలస వెళ్లాల్సి వస్తోంది. అయితే ఆ గ్రామా నికి చేరుకోవడానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అవస్థలకు గురవుతున్నారు. రోడ్డంతా అడుగడుగునా రాళ్లుతేలడంతో అత్యవసర సమయంలో సకాలంలో వైద్యం అందక గర్భిణులు, చిన్నారులు మృత్యువాతపాలవుతున్నారని గిరిజనులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే రోడ్డంతా బురదమయంగా మారుతుండడంతో ఆ సమయంలో రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. తమ గ్రామాలకు సక్రమంగా విద్యుత్‌సరఫరా కావడంలేదని గిరిజన యువకులు వాపోతున్నారు. ఎన్నికల సమ యంలో తమ గ్రామానికి వసతులు కల్పిస్తామని హామీఇచ్చి తర్వాత మరచిపోతున్నారని గిరిజనులు వాపోతున్నారు.

నీటి చౌర్యానికి పాల్పడేవారిపై చర్యలు

●బొబ్బిలి మునిసిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

బొబ్బిలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని బొబ్బిలి మునిసిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. గ్యాలరీవెల్స్‌కు నీటి నిల్వలు పెరిగేలా శాండ్‌బండ్స్‌ను ఏర్పాటు చేస్తామని, అక్రమంగా విద్యుత్ మోటార్లతో నీటిచౌర్యానికి పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. బుధవారం భోజరాజపురంలోని మునిసిపల్ ప్రధాన వాటర్‌వర్క్స్‌ను చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, కమిషనర్‌తోపాటు వైస్‌చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, గొలగాని రమాదేవి, కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, పాలవలస ఉమాశంకర్, మరిపి తిరుపతిరావు, సవలాపురం రామకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్ పరిశీలించారు.టీడీపీ కౌన్సిలర్లతోపాటు ఇటీవల చైర్మన్ అవిశ్వాసం పెట్టేందుకు ముందుకొచ్చిన తొమ్మిది మంది వైసీపీ కౌన్సిలర్లు పరిశీలనకు గైర్హాజరయ్యారు. వేగావతి నదిలో నీటి లభ్యత, ఇన్‌ఫిల్ట్రేషన్ బావులను పరిశీలించారు. రోజువారీ నీటి పంపింగ్, లీకేజీలు తదితరసమస్యలను మునిపిపల్ డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈ గుప్తలను అడిగి తెలుసుకున్నారు. వాటర్‌వర్క్స్‌లోసమస్యలను ఫిట్టరు అప్పారావు అధికారులు, పాలక వర్గం సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ,కౌన్సిలరు ఇంటి గోవిందరావు మాట్లాడుతూ కుళాయిలకు అక్రమంగా మోటార్లు పెట్టి నీటి చౌర్యానికి పాల్పడుతుండడంతో పట్టణ ప్రజలకు సక్రంగా నీటిని అందివ్వ లేకపోతు న్నామని తెలిపారు.డీఈ, ముగ్గురు ఏఈలు, సచివాలయం సిబ్బంది ఉన్నా తాగునీటిని సక్రమంగా అందివ్వలేకపోవడం, పర్యవేక్షణ చేయలేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేయని అధికారులు,సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటిని విడిచిపెట్టే సమయంలో ఆయా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తే అక్రమ విద్యుత్ మోటార్లు ఉన్నవారిని అరికట్టవచ్చని ఏఈలు సూచించారు.



వేగావతి నదిలో వాటర్‌వర్క్సును పరిశీలిస్తున్న కౌన్సిలర్లు, అధికారులు

వంతెన పూర్తిచేయడమే లక్ష్యం

● పంచాయతీ జేఈ రుక్మాంగధనాయుడు



వేగావతి నది సమీపంలో కొలతలు తీస్తున్న అధికారులు

బొబ్బిలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భోజరాజపురం వంతెన వచ్చే ఏడాది మే కల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పంచాయతీ జేఈ రుక్మాంగధ నాయుడు తెలిపారు.భోజరాజపురానికి వంతెన నిర్మాణం కోసం గతంలో మంజూరైన 15 కోట్లతో మునిసిపల్ ప్రధాన వాటర్‌వర్క్స పక్క నుంచిపనులను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ మేరకు మున్సిపల్ వాటర్‌వర్క్సుకు చెందిన ఎనిమిది సెంట్లు అవసరం కావడంతో బుధవారం కమిషనరు, ఇతర అధికారులతో జేఈ చర్చించి, వారి సమక్షంలో కొలతలు తీసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో వంతెన నిర్మాణం కోసం శంకుస్థానన జరిగిందని, సుమారు రూ. 5 కోట్లు పనులు జరగ్గా, రూ.2 కోట్ల బిల్లులను చెల్లించినట్లు తెలిపారు. గొర్లెసీతారాంపురం జంక్షన్ రాష్ట్రీయ రహదారి నుంచి సుమారు రెండుకిలోమీటర్ల పొడవున రోడ్డుతో కూడిన వంతెన నిర్మిస్తున్నామని చెప్పారు. వంతెనకు ఇరు వైపులా, రామభద్రపురం మండలం వరకు ఈ అప్రోచ్ రోడ్డు ఉంటుందని తెలిపారు. పనులు జరిగిన మేరకు బిల్లుల కోసం ప్రతిపాదనలు పంపామని చెప్పారు. మునిసిపాలిటీకి చెందిన ఎనిమిది సెంట్ల స్థలాన్ని అప్పగించాలని పాలకవర్గాన్ని, అధికారులను అడిగామని జేఈ తెలిపారు. అనుమతి వచ్చిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్, ప్రహరీలను తొలగించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ మేరకు కమిషనరు రామలక్ష్మి తదితరులతో చర్చించామని తెలిపారు.

ఓటర్ల జాబితాపై అవగాహన అవసరం



చింతాడలోని పదో తరగతి పరీక్ష కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీను

బొబ్బిలి రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో నూతన ఓటరు నమోదు, తప్పుల సవరణ, తొలగింపు తదితర అంశాలపై పూర్తి అవగాహన అవసరమని తహసీల్దార్ ఎం.శ్రీను తెలిపారు. బుధవారం బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో శిక్షణనిర్వ హించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా రూపకల్పన, 6, 7, 8 ఫారాలపై అవగాహన, నూతన ఓటరు నమోదు, తప్పుల సవరణ, ఓటర్ల తొలగింపుపై సూచనలిచ్చారు.కార్యక్రమంలో ఈఆర్‌వో గౌరిశంకర్ పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను తహసీల్దార్ ఎం.శ్రీను ఆదేశించారు. మండలంలోని చింతాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, నిర్వహణ తీరును అడిగి తెలుకున్నారు. ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించారు.

మెనూను తప్పనిసరిగా పాటించాలి

రామభద్రపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో రత్నం కోరారు. బుధవారం మండలంలోని కొట్టక్కిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు రుచికరమైన వేడి ఆహారం అందించాలని, రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. టీచర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని కోరారు. స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించారు. పిల్లల సామర్థ్యాలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఆకుల ప్రవీణ్‌కుమార్, మండలపరిషత్ జూనియర్‌అసిస్టెంట్ చిట్టూరు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్‌హౌస్ కాలనీ పాఠశాల తనిఖీ

బొబ్బిలి రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి) - బొబ్బిలిలోని గెస్ట్‌హౌస్ కాలనీలో గల ఎంపీయూపీ పాఠశాలను బుధవారం ఎంఈవో సీ హెచ్ లక్ష్మణరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుతవిద్యార్థుల హాజర్ పట్టీ, అనంతరం హోం వర్క్, పఠన నైపుణ్యాలు, మధ్యాహ్న భోజనాన్నిపరిశీలించారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆర్టీసీ డిపోలో వివిధ విభాగాల్లో సేవలు అందిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగు కార్మికులు, హైర్ బస్సుల డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. డిపో ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైర్ బస్సుల యాజమాన్యాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్‌ప్రతినిధులు జీఎస్ఎన్‌రాజు, సురేష్ పాల్గొన్నారు.

ఒకటో తేదీన భగత్‌సింగ్ వర్ధంతి

విజయనగరం దాసన్నపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ వర్ధంతిని ఏప్రిల్ ఒకటో తేదీన ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తామని పీడీఎస్‌వో, ఎన్‌వోఎస్ ప్రతినిధులు అప్పలరాజు, గిరిప్రసాద్ తెలిపారు. విజయనగరంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో దిలీప్,భాస్కరరావు, కిరణ్ పాల్గొన్నారు.

ఆ రెండు గ్రామాలపై ఫ్లో'రైడ్'

(5వ పేజీ తరువాయి)

దంత సంబంధిత ఫ్లోరోసిస్‌తో ఎక్కువ మంది బాధపడుతున్నారు. గతంలో కేవలం విటమిన్ మాత్రలు ఇచ్చి వైద్య ఆరోగ్యశాఖ చేతులు దులుపుకుంది. అటు గ్రామీణ రక్షిత నీటి విభాగం సైతం పెద్దగా స్పందించడం లేదు. సమగ్ర నీటి పథకం నుంచి కుళాయిల ద్వారా నీరు అందిస్తున్నా లీకులతో ఈ నీరు కూడా కాలుష్యమవుతోంది.

యువకుల్లోనూ అధికం..

ఎక్కువ మంది యువకులు కూడా రోగాల బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ రెండు గ్రామాల్లో వందలాది మంది బాధితులున్నారు. కానీ వైద్య ఆరోగ్య శాఖ కానీ.. అనుబంధ శాఖలు కానీ గణాంకాలు బయటపెట్టడం లేదు. నరాల బలహీనత, కీళ్లు వంగిపోవడం, వంకర్లు తిరగడం, దంతాలు రంగు మారడం, కీళ్ల నొప్పులు అధికంగా ఉండడం, కండరాల క్షీణత, కిడ్నీ సంబంధిత వ్యాధులతోనూ ప్రజలు బాధపడుతున్నారు. ప్రధానంగా నడుము వంగిపోవడం, కాళ్లు వంకర్లు తిరిగిపోవడం ఎక్కువగా కనిపిస్తోంది. కేవలం ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్లే ఈ రుగ్మతులు వస్తున్నాయని గుర్తించినా అధికారులు ఉదాసీనంగానే వ్యవహరిస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం ఈ రెండు గ్రామాల గురించి పట్టించుకునేవారు లేకపోయారు. సమగ్ర నీటి పథకానికి సంబంధించిన పైపులైన్లు బాగుచేయాలని, రక్షిత నీటి పథకానికి సంబంధించి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుచేయాలని కోరినా ఫలితం లేకపోయింది. రోగాలతో సతమతమవుతున్న వీరు అతి కష్టమ్మీద వైద్యసేవలు పొందుతున్నారు. 20 లీటర్ల క్యాన్ నీటిని రూ.20 లెక్కన కొనుగోలు చేస్తున్నారు.

భయపడాల్సిన అవసరం లేదు

ఆ రెండు గ్రామాల్లో భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ అధికంగా ఉంది కానీ ఆ ప్రభావంతోనే ఎక్కువగా ఇబ్బందులు ఉండవు. నోటి పళ్లు రంగుమారొచ్చు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. గ్రామాన్ని సందర్శించి ప్రజలకు అవసరమైన వైద్యం అందించేలా చర్యలు చేపడతాం. సీజనల్ వారీగా శిబిరాలు నిర్వహిస్తున్నాం. విటమిన్ మాత్రలను కూడా అందించాం.

- ప్రశాంత్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, మండాకురిటి

ఆర్వో ప్లాంట్లు ఎక్కడ?

మా గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య ఉంది. బోరు పంపుల వల్లేనని ప్రైవేటు వైద్యులు గతంలో నిర్ధారించారు. నేను ఆరేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాను. కాళ్ల వాపులతో పూర్తిగా నడవలేని పరిస్థితి. మందులు వాడినా నయం కావడం లేదు. మా గ్రామంలో ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటుచేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. కానీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఉన్న చేతిపంపుల నుంచి ఫ్లోరైడ్ నీరు వస్తోంది.

- జడ్డు వెంకన్న, గ్రామస్థుడు, చినముకుందపురం

అంతలోనే అమ్మకు దూరంగా..

(5వ పేజీ తరువాయి)

మృతదేహం వద్ద భోరున విలపించింది. బూర్లెపేట గ్రామానికి చెందిన లక్ష్మీ, రాములుకు కుమార్తె మౌనిక, కుమారుడు భాస్కరరావు ఉన్నారు. మౌనిక పదో తరగతి కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో చదువుతున్నప్పుడు టాపర్‌గా నిలిచింది. ఇంటర్ నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరింది. రెండు నెలల క్రితమే అన్నయ్యకు వివాహమైంది. సంతోషంగా ఉన్న సమయంలో ఆ కుటుంబాన్ని విధి దుఃఖసాగరంలోకి నెట్టింది. కూలీ పనులు చేసుకుంటూ కుమార్తెను చదివిస్తున్నానని, ఇటీవలే తన కుమారుని పెళ్లి చేసి తాపీ పనుల కోసం విశాఖలో ఉంటున్నానని తండ్రి రాములు కన్నీటి పర్యంతమయ్యాడు. మౌనిక మృతిగురించి తెలుసుకు న్న స్నేహితులంతా వచ్చి తీవ్రంగా విలపించారు.

పిచ్చుకా.. ఎక్కడికెళ్లావ్?

(ఐదో పేజీ తరువాయి)

కరవవడం, ఆహారం, నీరు కొరత పిచ్చుక జాతికి శత్రువులుగా మారాయి. రేడియేషన్‌తో సంతానోత్పత్తి సామర్థ్యం దెబ్బతింటుంది. గుడ్లు పెట్టే సామర్థ్యం తగ్గిపోతుంది. పిచ్చుకలు సాధారణంగా చెట్లు, పూరిపాకల పైకప్పు కింద గూళ్లు ఏర్పాటు చేసుకుంటాయి. చెట్లతో పాటు పూరిపాకల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో వీటికి ఆవాసం కరువైంది. దీనికి తోడు జీవన శైలిలో వచ్చిన మార్పులతో పాటు అంతరిస్తున్న పచ్చదనం, రసాయనాలతో పండ్లు, ఆహార ధాన్యాల ఉత్పత్తి కూడా ఇవి అంతరించిపోవడానికి కారణమవుతున్నాయి. సెల్ టవర్ల నుంచి వచ్చే రేడియేషన్ వీటి మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోందని సంబంధిత నిపుణులు చెబుతున్నారు.

సహజ సిద్ధ వాతావరణం అవసరం..



పిచ్చుక చాలాచిన్న పక్షి. ఈ జాతి మనుగడకు సహజ సిద్ధమైనవాతావరణం కల్పించాలి.ప్రధానంగా తుమ్మచెట్లు పెంచా లి.ఈ చెట్లపైనే ఎక్కువగా నివాసంఉంటాయి. రాగులు, సజ్జల వంటి పంటలు పండించాలి. మనతో పాటు సహజీవనం చేసే పిచ్చుకలను భవిష్యత్ తరాల వారు ఫొటోలు, వీడియోల్లో చూసే దుస్థితి కలగకుండా ఉండాలంటే చెట్లను పెంచాలి. చెట్ల నరికివేతను అడ్డుకోవాలి. ఇవి తిరిగే ప్రదేశాలను గుర్తించాలి. అక్కడి నుంచి తీసుకురావాలి. ఇళ్లల్లో పరిశుభ్రమైన మంచి నీళ్లు, రాగులు, గంటెలు, సజ్జలు అందుబాటులో ఉంచాలి. గూడు కట్టుకొనేందుకు అవకాశం కల్పించాలి. వాతావరణ సమతుల్యత సాధిస్తేనే తిరిగి వీటిని చూడగలం.

-బొబ్బిలి రామకృష్ణ, గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జీయో), శృంగవరపుకోట

తుమ్మ చెట్లపై పిచ్చుక గూళ్లు..



మాగ్రామపరిధిలో దాదాపుగా ప్రతిచెరువులోనూ తుమ్మచెట్లు పెం చేవారు.ఈ చెట్ల కొమ్మలకు గూళ్లు కట్టుకునేవి. వాటిలో గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేసేవి. చెరువుల్లోకి మేతకు పశువులను తీసుకెళ్లేటపుడు పిచ్చుకలకిలకిలా శబ్దాలు హాయి గొలిపేవి. వరి, రాగులు, గంటెపంటలవద్ద గుంపులు,గుంపులుగా ఉండేవి.రాగులు, గంటెలు పం డిం చడం లేదు. కేవలం వరి మాత్రమే పండుతోంది. ఇప్పుడు పంటలకు క్రిమిసంహా రక మందులువాడుతున్నారు.దీంతో పిచ్చుకలు అంతరించిపోతున్నాయి.ఇప్పుడు చెరు వుల్లో చెట్లులేవు.పొలాల్లోని తాటి చెట్లను కూడావదల్లేదు. ఇవిఆవాసాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో పిచ్చుకలు ఎక్కడా కనిపించడం లేదు.

-ముక్కా మల్లునాయుడు (75), కొట్యాడ గ్రామం, ఎల్.కోట మండలం

మా ఇంట్లో పిచ్చుకలు గూళ్లు కట్టేవి..



మాకు పెంకుటిల్లు ఉండేది. ఇంటి చూరుకు పిచ్చుకలు గూళ్లు నిర్మించేవి. ఇందులో గుడ్లు పెట్టి పొదిగేవి. పిల్లలకు నోటితో ఆహారం అందించేవి. ఈ దృశ్యం చూడడానికి చాలా బాగుండేది. మా పొలంలో గుంపులుగా పిచ్చుకలు ఉండేవి. మేము అక్కడకు వెళ్లగానే అవి పైకి ఎగిరేవి. ఈ దృశ్యం కూడా అద్భుతంగా ఉండేది. పెంకిటిళ్ల స్థానంలో డాబా ఇళ్లు వచ్చాయి. ప్రస్తుతం అవి తినేందుకు ధాన్యం గింజలు, తాగునీరు పెడుతున్నాం. అప్పుడప్పుడు ఒకటి రెండు పిచ్చుకలు వచ్చి.. ఆహారం తిని... నీరు తాగి వెళుతున్నాయి.

-ముక్కు జానకీబాయి, విజయనగరం రోడ్డు, శృంగవరపుకోట

విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి

●ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

రామభద్రపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను బలోపేతం చేయ డానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునా యుడు కోరారు. బుధవారం రామభద్రపురంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాననిచెప్పారు. పీఆర్సీ సాధనతోపాటు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు బొప్పే రవికుమార్ ఆధ్వర్యంలో శ్రీనివాసులునాయుడును సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ యూనియన్ నాయకులు సువ్వాడ వెంకటప్పలనాయుడు, డోకల రఘురాంనాయుడు, గున్నరాజు, గేదెల ముసలయ్య, వైఎల్.నాయుడు, చింతల వెంకటరావు, గంగాధరరావు, వసంతుల అప్పారావు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల సంఖ్య పెంచండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అవసరమైన రూట్లలో స్కూల్ బస్సుల సంఖ్య పెంచాలని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, రాజు డిమాండ్ చేశారు. బుధవారం విజయనగరంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ డిపో ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా స్కూల్ బస్సుల సంఖ్య పెంచడంతో పాటు సమయ పాలన పాటించాలన్నారు. గత మాదిరి విజయనగరం నుంచి రణస్థలం, విజయనగరం నుంచి సతివాడ, విజయనగరం నుంచి కుమిలి వరకూ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు శిరీష, సోమేష్, శివ, గుణ, జయ, లక్ష్మి పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల పునరుద్ధరణ చర్చపై హర్షం

బొబ్బిలి/రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్ర, ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు మీసేవ కేంద్రాలను పునరుద్ధరణపై అసెంబ్లీలో చర్చించడంతో మీసేవ ఆపరేటర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం బొబ్బిలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద మీసేవ ఆపరేటర్ల నాయకుడు మామిడి ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రాంబార్కి శరత్‌కుమార్, మీసేవ ఆపరేటర్స్ అజయ్ పాల్గొన్నారు.



బొబ్బిలిలో హర్షం వ్యక్తం చేస్తున్న మీసేవ ఆపరేటర్లు

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

బాడంగి, మార్చి 19(ఆంధ్రజ్యోతి) ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం నుంచి మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలంలోని 18 సెంటర్ల పరిధిలో గల కార్యకర్తలకు బాడ ంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సదుపాయాలు కల్పించాలి

తెర్లాం, మార్చి19(ఆంధ్రజ్యోతి): పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి తహసీల్దార్ హేమంత్ కుమార్ సూచించారు. బుధవారం పెరుమాళితోపాటు మూడు పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీచేశారు. ఆయనవెంట ఎంఈ వోపాపారావు,వీఆర్వో గణపతిరావు ఉన్నారు.

టీబీ పరీక్ష చేయించుకోవాలి

బొబ్బిలి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఛాతిలో నొప్పి, జ్వరం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా టీబీ పరీక్ష చేయించుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి టీబీ సూపర్‌వైజర్ ఆర్.శ్రీదేవి తెలిపారు. బుధవారం బొబ్బిలిలో ట్రెజరీ కార్యాలయం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగు వంటి లక్షణాలు ఉంటే పరీక్షలు నిర్వహించుకో వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీను, ఈఆర్వో గౌరిశంకర్, లాబ్ టెక్నీషియన్ ఎల్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కోమటిపల్లిలో ఆధార్ కేంద్రం

బొబ్బిలి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలోనే ఆధార్‌కార్డు సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశంతో శిబిరాలు ఏర్పాటుచేసినట్లు ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. బుధవారం కోమటిపల్లిలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సునీతా విలియమ్స్ స్ఫూర్తి

బొబ్బిలి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహిళలకు వ్యోమగామి సునీతా విలియమ్స్ స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ సీబీఎం పాఠశాల ఉపాధ్యాయుడు కె.కృష్ణదాస్ తెలిపారు. బుధవారం అలజంగి సీబీఎం పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆమెకు పుష్పాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు సైకిల్ నుంచి స్పేస్ స్టేషన్ వరకు రిపేరు చేయగలరని తెలిపారు.